ఇవేం ఫ్లెక్సీలురా బాబూ!


ఆర్డీఓ ఆఫీస్ వద్ద మహాకవి ఎర్రన విగ్రహం కనిపించకుండా..


దేవుడుచెరువు సర్కిల్ మలుపు రోడ్డు మార్జిన్‌లో ప్రమాదకరంగా..


అద్దంకి బస్టాండ్‌లోని మాగుంట సుబ్బరామిరెడ్డి విగ్రహం ఫౌంటేన్ కనపడదేం..


కర్నూలు రోడ్డు ఫ్లైఓవర్ కింద ఉన్న విగ్రహాలు, గత చరిత్రను తెలిపే పెయింటింగ్స్‌కి అడ్డుగా..


బాపూజీ కాంప్లెక్స్ వద్ద ఉన్న రోశయ్య విగ్రహం వద్ద కూడా..

ఒంగోలు పట్టణం ఫ్లెక్సీల మయంగా మారింది. టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత రోడ్లను ఆక్రమిస్తూ భారీ ఫ్లెక్స్ బ్యానర్లు ఏర్పాటు చేస్తున్నారు. దీనివల్ల వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సర్కిల్స్ వద్ద కూడా ఏర్పాటు చేస్తుండటంతో ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులకు అటు నుంచి ఏమి వస్తుందో తెలియక తికమక పడుతున్నారు. భారీ ప్రమాదాలు చోటు చేసుకోకముందే పోలీసు, మున్సిపల్ శాఖలు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.

- సాక్షి, ఒంగోలు


కొత్తపట్నం బస్టాండ్ స్వామి వివేకానంద విగ్రహం చుట్టూ


ఇరువైపులా వచ్చే వాహనాలు కనిపించకుండా రోడ్డు ఆక్రమిస్తూ కోర్టు సెంటర్‌లో ఏర్పాటు చేసిన ఫ్లెక్స్ బ్యానర్


ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకుండా చర్చి సెంటర్‌లో నడి రోడ్డుపై ఏర్పాటు చేసిన ఫ్లెక్స్


సెంట్రల్ కేఫ్ సర్కిల్‌లో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకుండా పోలీస్ అవుట్ పోస్టుకు ఏర్పాటు చేసిన ఫ్లెక్స్.. అవస్థలు పడుతున్న వాహనచోదకులు

క్లుప్తంగా

స్టాఫ్ డయేరియాపై అవగాహన


స్టాప్ డయేరియాపై అవగాహన కల్పిస్తున్న జేజేఎం సిబ్బంది

చీమకుర్తి: జలజీవన్ మిషన్ ఆధ్వర్యంలో మంగళవారం బండ్లమూడి జిల్లాపరిషత్ హైస్కూలు విద్యార్థులకు అవగాహన కల్పించారు. అతిసారం ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. డయేరియా నివారణ కోసం స్థానిక వైద్య సిబ్బంది అవగాహన కల్పించాలని కోరారు. జలజీవన్ మిషన్ జిల్లా కోఆర్డినేటర్ వి.కేశవరావు, డాక్టర్ కల్పన, ఇతర వైద్యసిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల చేతుల్లోనే పిల్లల భవిష్యత్


తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న రమేష్

ఈతముక్కల (కొత్తపట్నం): పిల్లల భవిష్యత్ తల్లి దండ్రుల చేతుల్లోనే ఉందని వారిని బడికి పంపించాలని అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ రమేష్ అన్నారు. ఈతముక్కల గ్రామం ఎంపీపీ స్కూల్‌లో మంగళవారం ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమం నిర్వహించారు. ఇంటికి వచ్చిన తరువాత మీ పిల్లలకు కౌన్సెలింగ్ చేయాలన్నారు. కార్యక్రమంలో స్కూల్ హెచ్ఎం చెంచుపున్నయ్య, ఎంఈవో–2 పద్మావతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో శ్రీవారి ఆస్థానం


చతుర్వేద పారాయణంలో ఆలయ అర్చకులు

ఒంగోలు మెట్రో: ఒంగోలు కొండపై వెలిసిన శ్రీగిరి వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో శ్రవణ నక్షత్రాన్ని పురస్కరించుకుని శ్రీవారి ఆస్థానం కార్యక్రమాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ అర్చకులు వేద పండితులు శ్రీవారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. నాద నీరాజనం, చతుర్వేద పారాయణ, విష్ణు సహస్ర నామ పారాయణతో పాటు రామాయణం, భగవద్గీత, భాగవత పద్యాలను, శ్లోకాలను గానం చేశారు. శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి, కార్య నిర్వహణ ధర్మకర్త సీవీ రామకృష్ణారావు, ధర్మకర్తలు ఆలూరు వెంకటేశ్వర రావు, ఆలూరు లక్ష్మీ కుమారి తదితరులు పర్యవేక్షించారు. భక్తులకు శ్రీవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు.కాగా ఈ నెల 28వ తేదీ ఆదివారం ఉదయం తొమ్మిది గంటలకు శ్రీవారికి సువర్ణ అష్టదళ పద్మ పాదార్చన జరుగుతుందని దేవస్థాన కార్యాలయంలో సంప్రదించి పేర్లను నమోదు చేసుకోవాలని నిర్వాహకులు కోరారు.

ప్రపంచ తెలుగు రచయితల మహాసభలు

● విజయవాడలో డిసెంబర్ 28, 29 తేదీల్లో..

ఒంగోలు మెట్రో: ప్రపంచ తెలుగు మహాసభల (1975) స్వర్ణోత్సవాల సందర్భంగా డిసెంబరు 28, 29 తేదీల్లో విజయవాడ కొత్తపేట కాకరపర్తి భావనారాయణ కళాశాల ప్రాంగణంలో 6వ ప్రపంచ తెలుగు రచయితల మహాసభలు జరగనున్నాయి. ఈమేరకు ఉభయ రాష్ట్రాలు మరియు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు భాషాభిమానులను, సాహితీ ప్రముఖులంతా తప్పక పాల్గొనాలని నిర్వాహకులు గుత్తికొండ సుబ్బారావు, డాక్టర్ జి.వి.పూర్ణచందు ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు సహ నిర్వాహకులు డాక్టర్ నూనె అంకమ్మరావు, తేళ్ళ అరుణ పేర్కొన్నారు. వివిధ అంశాలపై ప్రసంగాలు, సదస్సులు, కవిసమ్మేళనాలు ఎంపిక చేసిన 100 మంది యువకవులతో ఆలపిస్తాం హాయిగా ప్రత్యేక కవితావైభవ సభ, ఇతర సాహితీ కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.

యువ రచయితల సమ్మేళనం

యువతరంలో తెలుగు జాతీయతా భావాన్ని ప్రోది చేసే లక్ష్యంతో ఈ మహాసభల్లో ప్రత్యేకంగా యువ రచయితల సమ్మేళనం నిర్వహిస్తున్నారు. 40 యేళ్ళ లోపు వయసు ఉన్న యువ రచయితల కోసం వివిధ సాహిత్య ప్రక్రియలపై కార్యశాలలు (వర్క్ షాపులు) ఉంటాయి. పద్యరచన , వచన కవిత, మినీకవిత కథ, నవల గేయాలు, గజల్స్, దృశ్య శ్రవ్య నాటకాలు, వ్యాస రచన, పరిశోధన, గ్రంథ పరిరక్షణ, బాల సాహిత్యం, అనువాద ప్రక్రియ , సాంకేతిక పరి/జ్ఞానం, సోషల్ మీడియా వినియోగం మొదలైన అంశాలపై ఆయా రంగాల్లో ప్రసిద్ధులైన సాహితీ మూర్తులు, సాంకేతిక నిపుణులు శిక్షణనిస్తారని, హాజరైన విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలు, ఉత్తీర్ణతా పత్రాలు అందిస్తామని తెలియజేశారు.

ఈ మహాసభలలో రచయితలు, విద్యార్థులు కూడా ప్రతినిధులుగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని, కృష్ణాజిల్లా రచయితల సంఘం మరియు ప్రపంచ తెలుగు రచయితల సంఘం జీవిత సభ్యులుకూడా ప్రతినిధులుగా నమోదు చేసుకోవాలని చెప్పారు. ప్రతినిధులు మాత్రం.. ఈ ఏ అంశంలోనయినా పాల్గొనే అవకాశం ఉంటుందని తెలిపారు. వివరాలకు 9391238390, 9440167697, 9440172642, 9885660972లకు ఫోన్ చేయవచ్చు.

నిజాయితీ చాటుకున్న ఆటో డ్రైవర్

ఒంగోలు టౌన్: ఓ ఆటో డ్రైవర్ తనకు దొరికిన సూట్‌కేసును పోలీసు స్టేషన్లో అప్పగించి తన నిజాయితీ చాటుకున్నారు. నగరంలోని సుజాత నగర్‌కు చెందిన పరిటాల సురేష్ కుటుంబ సభ్యులతో కలిసి నూతలపాటి శివప్రసాద్ ఆటో ఎక్కారు. తన అవసరం కోసం 7 సవర్ల బంగారు అభరణాలు, రెండు బంగారు హారాలు సూట్‌కేసులో పెట్టుకొని వచ్చిన ఆయన తులసీరాం థియేటర్ సెంటర్లో ఆటో దిగారు. అయితే హడావిడిలో ఆటోలోనే సూట్‌కేసు మరచిపోయాడు. కొద్దిసేపటి తరువాత సూట్‌కేసును గమనించిన ఆటో డ్రైవర్ శివప్రసాద్ తాలుకా పోలీసు స్టేషన్‌కు వచ్చి సీఐ షేక్ ఖాజావలికి జరిగిన విషయం చెప్పి సూట్ కేసును అప్పగించాడు. ఆ తరువాత సురేష్ తాలూకా స్టేషన్లో ఫిర్యాదు చేయడానికి వచ్చారు. పూర్తి వివరాలను విచారించిన సీఐ పోగొట్టుకున్న సూట్‌కేసును ఆయనకు అప్పగించారు. ఆటో డ్రైవర్‌ను సీఐతో సహా పలువురు అభినందించారు.


పోగొట్టుకున్న, బంగారు నగలను అందిస్తున్న సీఐ షేక్ ఖాజావలి

ముగిసిన అంజిరెడ్డి అంత్యక్రియలు


అంజిరెడ్డి అంత్యక్రియలు నిర్వహిస్తున్న దృశ్యం

జె.పంగులూరు: రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి సమీపం బంధువు, మండల వైఎస్సార్ సీపీ నాయకుడు భీమనాథం అంజిరెడ్డి అంత్యక్రియలు మంగళవారం కొండమూరు గ్రామంలో జరిగాయి. అంజిరెడ్డి కుమారుడు సుబ్బారెడ్డి తన తండ్రి చితికి నిప్పంటించారు. అంజిరెడ్డి అనారోగ్యంతో ఆదివారం మరణించిన విషయం పాఠకులకు తెలిసిందే. ఆయన మనుమరాలు సాయి శ్వేత అమెరికాలో ఉండటంతో, మంగళవారం కొండమూరు గ్రామం చేరుకున్న అనంతరం అంత్యక్రియలు జరిగాయి. ముందుగా అద్దంకి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వైవీ భద్రారెడ్డి భౌతిక కాయానికి నివాళులర్పించారు. పలువురు నాయకులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు.

రసాయనిక ఎరువుల వాడకం తగ్గించాలి


రైతులకు సూచనలు ఇస్తున్న డాక్టర్ రమేష్

రాచర్ల: రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించాలని దర్శి ఏరువాక కేంద్రం ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ జి.రమేష్ అన్నారు. మండలంలోని చోళ్లవీడులో రైతులు సాగు చేసిన వివిధ పంటలను పరిశీలించి తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఖరీఫ్ సీజన్‌లో ప్రధానంగా సాగు చేసే పత్తి పంట గురించి రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పత్తి పంటలో రసాయనికి ఎరువులు అవసరానికి మించి ఎక్కువగా వాడటంతో సూక్ష్మ పోషకాలు లోపాలు ఎక్కువగా రావడంతో పాటు పురుగులు, తెగుళ్ల ఉధృత్తి ఎక్కువగా ఉంటుందని తెలిపారు. ప్రస్తుతం పత్తిలో పచ్చదోమ, తామర పురుగుల ఉధృత్తి ఎక్కువగా ఉందని దీని నివారణకు ఇమిడాక్లోప్రిడ్ 0.4 ఎంఎల్ లేదా ఎసిటామిప్రిడ్ 0.2 గ్రాముల లేదా ఫిప్రోనిల్ 2 ఎమ్ఎల్ లీటరు నీటికి కలిసి పంటపై పిచికారీ చేయాలని రైతులకు తెలియజేశారు. ప్రభుత్వ 50 శాతం సిబ్సిడీపై సరఫరా చేస్తున్న పచ్చిరొట్ట విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని వివరించారు. అంతేగాక కొర్ర, ఆముదము పంటల్లో యాజమాన్య పద్ధతులను రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం చోళ్లవీడులో రైతులు సాగు చేసిన పత్తి, కొర్ర, ఆముదము పంట పొలాను పరిశీలించారు. గిద్దలూరు ఏడీఏ డి.బాలాజీనాయక్, వ్యవసాయాధికారి షేక్ అబ్దుల్ రఫీక్, వ్యవసాయా విస్తరణాధికారి బి.సంపత్ కుమార్ పాల్గొన్నారు.

అసిటామిప్రిడ్‌తో పచ్చదోమ నివారణ

బేస్తవారిపేట: పత్తి పంటలో పచ్చదోమ, తామర పురుగు నివారణకు అసిటామిప్రిడ్ లీటర్ నీటికి 0.2 గ్రాములు లేక ఇమిడాక్లోపిడ్ 0.2 ఎంఎల్ లీటర్ నీటికి కలిపి పచికారీ చేయాలని దర్శి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ జి.రమేష్ అన్నారు. మంగళవారం మండలంలోని జేబీకే పురంలో పత్తి, పచ్చిరొట్ట పైర్లను పరిశీలించారు. పొలం గట్ల వెంట కలుపు మొక్కలు లేకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచనలు ఇచ్చారు. వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు డి.బాలాజీనాయక్ మాట్లాడుతూ జనుము, జీలుగ, పిల్లిపెసర పైర్లతో భూమి సారవంతం అవుతుందన్నారు. సేంద్రియ కర్బన శాతం పెరగడంతో రసాయన ఎరువులు వాడకం తగ్గుతుందన్నారు. పచ్చిరొట్ట పంటలను పూత దశలో భూమిలో కలియ దున్నడంతో వాటిలోని పోషకాలు నత్రజని, భాస్వరం, పొటాష్ నేలలో కలిసి పంట ఏపుగా పెరుగుతుందన్నారు. వ్యవసాయాధికారి జక్కం మెర్సీ, వీఏఏ జుబేద్, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా వెంకటేశ్వర స్వామి కల్యాణం


స్వామి వారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

ఒంగోలు మెట్రో: స్థానిక కేశవస్వామి పేటలో వేంచేసియున్న ప్రసన్న చెన్నకేశవ స్వామి దేవస్థానంలో సోమవారం శ్రవణా నక్షత్రం పురస్కరించుకొని కల్యాణాన్ని నిర్వహించారు. స్వామి అమ్మవార్ల మూలమూర్తులను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్ది భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. కళ్యాణ క్రతువులో పాల్గొన్న భక్తులకు దేవస్థానం నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. దేవస్థాన కార్యనిర్వహణాధికారి డి. రజని కుమారి, కాలభైరవ ఉపాసకులు మైనంపాటి సాయి, సిబ్బంది పాల్గొన్నారు.

కొత్తపట్నం హైస్కూల్‌లో శిక్షా సప్తాహే


విద్యార్థులు తయారు చేయిస్తున్న నమూనాలు

కొత్తపట్నం: స్థానిక బొమ్మిశెట్టి సీతమ్మ మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం శిక్ష సప్తాహే కార్యక్రమం నిర్వహించారు. గణితంలో టీఎల్ఎంలు విద్యార్థులతో తయారు చేయించారు. కొత్త రకాల నమూనాలు తయారు చేసిన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన హెచ్ఎం ఎం.శ్రీదేవి మాట్లాడుతూ ఇలాంటివి తయారు చేయటం ఎంతో ఆనందంగా ఉందన్నారు. మెరిట్ సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఎస్. రమేష్, గణిత ఉపాధ్యాయుడు సీహెచ్ కోటేశ్వరరావు, మధుసూదన్‌రావు, సుబ్రహ్మణ్యం అన్నపూర్ణ, చంద్రశేఖర్, రమేష్, కోటేశ్వరావు పాల్గొన్నారు.

వైఎస్సార్ జిల్లా ఎడ్ల సత్తా


రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీపీ కామూరి అమూల్య

కొమరోలు: మొహర్రం వేడుకల్లో భాగంగా మండలంలోని బాదినేనిపల్లెలో మంగళవారం రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు నిర్వహించారు. పోటీలను ఎంపీపీ కామూరి అమూల్య ప్రారంభించారు. పోటీలలో 12 జతల ఎడ్లు పాల్గొనగా వైఎస్ఆర్ కడప జిల్లా పొత్తురెడ్డిపల్లె గ్రామానికి చెందిన మూల సూరారెడ్డి ఎడ్ల జత 4033 అడుగుల దూరం లాగి ప్రథమ బహుమతి రూ.40వేలు గెలుచుకుంది. వైఎస్ఆర్ కడప జిల్లా బాలయ్యగారిపల్లె గ్రామానికి చెందిన సుధాకర్‌రెడ్డి ఎడ్ల జత 4000 అడుగుల దూరం బండను లాగి ద్వితీయ బహుమతి రూ.30వేలను, వైఎస్ఆర్ కడప జిల్లా రాజువారిపేట, పొత్తురెడ్డిపల్లె గ్రామాలకు చెందిన ప్రసాద్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి ఎడ్ల జతలు 3421 అడుగుల దూరం లాగి తృతీయ బహుమతి రూ.2 0వేలను సాధించింది. అదే జిల్లా గుడిపాడు గ్రామానికి చెందిన తుమ్మల నారాయణరెడ్డి ఎడ్ల జత 3240 అడుగుల దూరం బండను లాగి నాల్గవ బహుమతి రూ.15వేలను గెలుపొందగా నంద్యాల జిల్లా చాగలమర్రి గ్రామానికి చెందిన పెద్ది శివకాంతరెడ్డి ఎడ్ల జత 3200 అడుగుల దూరం బండను లాగి రూ.10వేలు నగదు బహుమతి సాధించారు.

రుణాలు సద్వినియోగం చేసుకోండి

ఒంగోలు రూరల్: డ్వాక్రా మహిళలకు అందిస్తున్న పీఎంఈజీపీ, పీఎంఎఫ్ రుణాల ద్వారా రుణాలను అందుకొని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా డీఆర్‌డీఏ పీడీ టి.వసుంధర అన్నారు. ఒంగోలు మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.గోపీనాథ్ సమన్వయ కర్తగా, మండల సమాఖ్య ఉపాధ్యక్షురాలు బి.గోపీనాథ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పీడీ మాట్లాడారు. 35 శాతం సబ్సిడీతో యూనిట్ ఏర్పాటు చేసుకొనేందుకు లక్ష రూపాయల నుంచి 25 లక్షల వరకు వ్యక్తిగత రుణాలు తీసుకొనే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ఒంగోలు ఎంపీడీఓ, మండల సమాఖ్య కార్యదర్శి ఎస్. అరుణ, ఉపకార్యదర్శి టి. జయలక్ష్మి, వి.మల్లేశ్వరి, వెంకట సుబ్బయ్య, చెంచమ్మ, రమణయ్య, సుధాకర్, సామ్రాజ్యం పాల్గొన్నారు.

విష జ్వరాలతో అప్రమత్తంగా ఉండాలి

గిద్దలూరు రూరల్: విష జ్వరాలతో అప్రమత్తంగా ఉండాలని పట్టణ వైద్యాధికారి డాక్టర్ షరీఫ్ అన్నారు. జ్వర సర్వే కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని అర్బన్ కాలనీలో మంగళవారం వైద్య ఆరోగ్య సిబ్బంది పర్యటించారు. ఈ సందర్భంగా ఇళ్లకు వద్దకు వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించారు. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా పరిసర ప్రాంతాలు మురికి మయమై దోమలు విజృంభిస్తున్నాయని, వాటి ద్వారా జ్వరాలు ప్రబలుతాయన్నారు. జ్వరాలు రాకుండా ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. డాక్టర్ భార్గవ్‌రెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్ సుధారాణి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
ఒంగోలు డివిజన్
9010224456 90103 57744
90102 02762
Office mail : sakshiongads@gmail.com